# నాకు తెలీదు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

వాడి సంగతులన్నీ నన్నెందుకడుగుతారో? నాతో ఎందుకు చెబుతారో? వాడి జోక్యం నాకస లవసరంలేదు. నేనసలు వాణ్ణి సరిగా ఎరగను.

"వాడు నీబంధువేటగా?" అంటారు- నా బంధువులందర్నీ నే నెరిగినట్టు. కస్త్వం భ్రాతః? మొన్న ఈమధ్య ఒక అతను మాయింటికొస్తే మర్యాదగా కూచోబెట్టి "ఏం పనిమీద వచ్చారు? ఏవూరు?" అని అడిగాను. నేనంత మర్యాదగా మాట్లాడించినా, అతను మొహం మటమటలాడించుకొని, ఏదో గొణుక్కుని లేచి వెళ్ళిపోయినాడు. మొహం ఎక్కడో చూచినట్టుందే అని అనుకున్నానుగాని, ఎంతసేపటికీ తట్టలేదు. ఆఖరుకు మా చెల్లెలిమొగుడి మొహమల్లే ఉందని జ్ఞాపకం వచ్చింది అతనేనా అన్నంత అనుమానం కూడా కలిగింది. చెప్పొద్దూ! కాని అతనయితే ఎందుకు వెళ్ళిపోతాడూ? పాపం. ఏం చూచుకుని అతనికింత అహంకారం ఉంటుందీ? బొత్తిగా లేనివాడు. నా బోటిగాడినుంచి అంతో ఇంతో సహకారం అపేక్షించదగినవాడు. అటువంటివాడు మాటా, పలుకు లేకుండా లేచి వెళ్ళిపోతాడా?"....కాని అంత పోలిక ఉండటం—ఉంటారు మనిషిని పోలిన మనుషులు!....

ఈ సీతాపతి - వీడి సంగతి అట్లా కాదే. వీడి మొహం ఎరుగుదును. కనపడితే మర్యాదకు పలకరిస్తాను. వీడూ నేనూ చిన్నతనంలో పదేళ్ళు కలిసి చదువుకున్నాం కూడాను. అయితే వాడి సంగతేమీ నాకు తెలీదు. నాకు వాడితో పెద్ద పరిచయం ఏమీలేదు. వాడు నన్నెరుగుదునని చెప్పుకుంటే నేనందుకు బాధ్యుణ్ణా? ఎవరెవరో వచ్చి, "నేను నీమేనత్త మొగుణ్ణిరా, నాయనా!" "నేను మీ పెద్దక్క బావగార్నోయ్!" "నేను మీ పినతల్లి మామగార్నబ్బాయీ" "నేను నీ ఫోర్తుఫారం క్లాసు టీచర్ని" "నేను నీ మేనమామ కొడుకునురా!" "నేను నీ పెత్తల్లి కొడుకును!" అంటూ చెప్పుకుంటారు. మొహాలు చూడబోతే అన్నీ కొత్తగా ఉంటై.

పోనీ నేను మొహాలు గుర్తించలేనివాణ్ణా? చదలవాడ కుమార్రాజాగార్ని నేనెప్పుడూ చూడలేదు. ఫొటో కూడా చూచినట్టు జ్ఞాపకంలేదు; కనక చూడలేదనే చెప్పాలి. మరి ఆయన్ని చూడగానే పోల్చుకోగలిగానా?

ఆమధ్య గిరిగారు ఫలానిటాకీ బహిరంగ ప్రదర్శనానికి వస్తారంటే ఆహ్వా

నమే తెప్పించుకు మరీ వెళ్ళా. గిరిగార్ని నేనెప్పుడూ చూడలేదు. ఆయన పరిచయభాగ్యం కోసరమే వెళ్లానుకూడాను. ఆయన ఫొటో చూడలేదని ఎట్లా చెప్పనూ? చూశాను. కాని గిరిగారికీ ఫొటోకీ ఏమీ సంబంధంలేదు. ఆయన పొట్టిగా సన్నగా ఉంటారు. తలపాగా చుట్టుకుంటారు. వయసు అరవై పై చిల్లర ఉంటై. ఫొటో చూసినవారెవరూ ఆయన్ని చూసి గుర్తించలేరని ఖండితంగా చెప్పగలను. అయినా నేనాయన్ని వెంటనే పోల్చాను. .. ఎవరో దేశద్రోహులు ఆ వచ్చినది గిరిగారు కాదనీ, మరొకరనీ అనుకుంటుంటే విన్నాను. తమ నాయకుల్నే గుర్తించలేని ఈ జనసామాన్యమంటే నాకు మంట. కాదూ మరీ?....

అందుచేత నేను మొహాలు గుర్తుపట్టలేననటానికి వీల్లేదు. గాంధీజీని ఎప్పుడో 1924 లో చూశానా, ఇవాళ ఆయన్నిచూసి క్షణంలోగుర్తించగలను.

ఈ సీతాపతి నన్ను ఆర్నెల్లు పోషించానని అందరితోటీ చెప్పుకుంటున్నట్టు విన్నాను. ఇదినేను సహించను. వాడికెప్పుడో గట్టిగా బుద్ధిచెబుతాను. ఈ బికారీవెధవ నన్ను పోషించడమేమిటి? నా వ్యాపారంమీద ఒక గంటలోవచ్చే లాభమంత లేదు వాడి నెలఖర్చు. వాడి జన్మలో ఎన్నడైనా బీడీ తప్ప కాల్చి ఎరుగునా? నన్నువీడు పోషించటమేమిటీ? ఎవడైనా వింటే నవ్విపోతాడు!

పోనీ నేనేమైనా ఇటువంటి విషయాలు మరిచే మనిషినా? ఎప్పుడో నేనింటరు చదువుతున్న రోజుల్లో శేషాచలానికి ఒక పావలా బదులిచ్చాను. అది అతను తిరిగి ఇచ్చేసినట్టే చెప్పాడు తరవాత అడగ్గా. ఇచ్చేసే ఉంటాడు కూడాను. చెప్పొచ్చిందేమంటే నాది చెడ్డ జ్ఞాపకశక్తి. చచ్చినా మరపను. అటువంటిది ఈ సీతాపతిగాడు నన్నారు నెల్లు పోషిస్తే నాకు జ్ఞాపకం ఉండదా?

అసలు మేమిద్దరము కలిసిఉన్నదెప్పుడూ? ఎక్కడా? 1936 లో ఒక గది తీసుకుని వాడు జార్జిటవును సందుల్లోఉండేవాడు. అప్పుడు మద్రాసు నాకు కొత్తగనక, బ్రాడ్వేలో నేను కనిపిస్తే, నన్ను వాడు, "ఎక్కడ ఉంటున్నా"వని అడిగితే, సామాను సత్రంలో పెట్టుకుని గదికోసం వెతుకుతున్నాననీ, ఉద్యోగంకోసం మద్రాసు వచ్చాననీ నేనుచెప్పితే, వాడు నన్ను గదిదొరికేదాకా తనగదిలోనే ఉండమని అంటే, పోనీ వాడికీ తోడుగా ఉంటుందిగదా అని సరేనన్నా. దగ్గిరగదా అని వాడు తినే హోటలుకే నేనూ వెళ్ళేవాణ్ణి. సినిమాలకు వాటికీ కలిసి వెళ్ళేవాళ్ళం.

సీతాపతిది నక్క తెలివని ఒప్పుకుంటాను. వాడికెంతముందాలోచనో! నాకు హోటలు టిక్కెట్లు కొనిపెట్టేవాడు. తాను బీడీలుకొన్నా నాకు సిగిరెట్టుపెట్టె కొనిపెట్టేవాడు, తన డబ్బుతో నన్ను సినిమాకు తీసుకెళ్ళేవాడు. నన్ను పోషించానని చెప్పుకునేటందు కివన్నీ చేస్తున్నాడని నాకేం తెలుసూ? పైగా ఆరునెల్లని చెబుతాడా? ఫిబ్రవరీలో నేను పట్నంవస్తే

అగస్టుకల్లా నాకు ఉద్యోగం దొరకనే దొరికిందిగద !....

ఈ సీతాపతి ఎవడో నాకు తెలీదు. వీడి ఊసెత్తకుండానే నా జీవితం హాయిగా వెళ్ళిపోతుంది. వీణ్ణిగురించి అర క్షణంకూడా వేదనపడవలిసిన అవసరం నాకులేదు. అయినా పోనీగదా, కష్టంలో ఉన్నాడుగదా, చెడుసావాసాలు చేస్తున్నాడుగదా, పంచిదారిని పెడదామనీ, ఆదుకుందామనీ, ఇంత రాబడి ఏర్పాటుచేద్దామనీ, నేను ప్రయత్నించిన మాట నిజమే. నేనల్లా కోరిందేమంటే- అదయినావాడిమంచికోరేగాని,-నాకేమో ఒరుగుతుందని కాదు - ఆదేశద్రోహుల సావాసం మానమన్నా. "నీకీ కూలి వాళ్ళసంఘాలెందుకు? దొంగమార్కెటు వాళ్లెట్లాపోతే నీకేం? జమీందార్లమీద కత్తికట్టేపాటివాడివా? ఎంతగొప్పవాడి వైనా అణకువ తెచ్చిపెట్టుకో. గాంధీకీ, సర్దారు పటేలుకూ, నెహ్రూకూ తెలీని రాజకీయాలు నీకుతెలుసునంటే ఎవరన్నా నవ్విపోతారు. నిన్నుచూసి అంతాఎంత నవ్వుతున్నారో నీకు తెలుసునా?.... ఇవన్నీ వొదిలేసుకుని నాదగ్గిరకిరా, నీకు, ఉద్యోగం ఇస్తా." అన్నాను.

రోగికి పథ్యం ఎక్కడన్నా రుచిస్తుందా? నన్ను నానామాటలూఅన్నాడు. నేను నా కూలీలరక్తం పీలుస్తున్నానుట. వాళ్ళడొక్క కొడుతున్నానుట. వాళ్లు తనమాట వింటారుట. వాళ్ళచేత సమ్మె చేయించి నేను తినేదంతా కక్కిస్తాట్ట. నావంటి వాళ్ళలో విశ్వాసం ఉంచబట్టే కాంగ్రెసునాయకుల రాజకీయాలు అడివిదారి పట్టినాయిట! తాను పనివాళ్ళ పక్షం ఉండబట్టే తనని కానెయ్యాలని నేను చూస్తున్నానుట. తనలోసహం చదువులేనివాడికి నా ఫ్యాక్టరీలో ఛీఫ్ ఫోర్మన్ ఉద్యోగంయిచ్చి రు 350 లు జీతం ఇస్తున్నాను అతనికి, పాపం, పనివాళ్ళంటే ఏమీ ఆపేక్షలేదు. ఎంతో స్వామిభక్తిపరాయణుడు. కూలీవెధవల్ని వెనకేసుకొచ్చిన వాళ్ళందరికీ ఉద్యోగాలిస్తే నేనుఅడుక్కు తినవలసిందే!

అడ్డమైన వాళ్ళతోటీ తిరిగి ఇటువంటి త్రాష్టులు "దొంగ వ్యాపారం, దొంగవ్యాపారం" అంటే నా వొళ్ళు మండిపోతుంది. దొంగవ్యాపారం అనగా ఏది? ఆర్థికశాస్త్రంబట్టి లేని వస్తువులకి ధర హెచ్చటం ధర్మం. ధరలు ఇష్టమై ఇవ్వగలవాళ్ళే కొంటారు. ధరలు ఇవ్వగలవాళ్ళనుబట్టే హెచ్చుతై. కొనుక్కోలేనివాళ్ళకోసం వ్యాపారం చేస్తామా? కొనుక్కోలేనివాళ్ళు ఎప్పుడూ ఉంటారు. ఏ ధరలకి వ్యాపారంచేసినా, దొంగవ్యాపారమే. పరప్రభుత్వం ఉండబట్టే ఈ కంట్రోళ్ళన్నీ వచ్చినై.

నేను దొంగవ్యాపారం చేసి లక్షలు చేసుకున్నానని ఈ సీతాపతి - నా ముక్కూ మొగమూ ఎరుగని ఈ దరిద్రనాయకుడు- నా మీద ప్రచారం చేస్తున్నాడు. అవును, వ్యాపారం చేసుకున్నాను. సంపాయించాను. తనకు చాతయితే సంపాయించలేకపోయినాడా? నామీద పడి ఏడవటం దేనికీ? నేను లక్షలు సంపాదిస్తే కట్టుకుపోయినానా? పరిశ్రమ సాగిస్తున్నాను. నలుగురికి భుక్తి ఏర్పాటు చేస్తున్నాను. వాళ్ళు

తిండి తినిపోతున్నారే అని ఏడుపు తనమా : వాళ్ళచేత సమ్మెలు చేయిస్తాట్ట, కూలివాళ్ళు ఆకాస్త తిండి తిని పోతున్నారని వీడి ఏడుపు. ఓర్చలేనమ్మ తనుపెట్టదు, అడుక్కు తిన నివ్వదు. అందర్నీ దొంగవ్యాపార్లనీ. ప్రజాద్రోహులనీ తిట్టే ఈ మూక నెప్పుడైనా చూడండి - వీళ్ళు ఒక ఈగకి పని చూపించలేరు. పని చేసేవాళ్ళని ఇంత తిననివ్వరు. సంఘాలంటారు. సమ్మెలంటారు.

వాళ్ళనని తప్పేమిట్లే ? ఈ కూలి వెధవలు కూడా వాళ్ళనే నమ్ముతారు. పెట్టేచెయ్యే కరిచే కుక్కలు వాళ్ళు. వాళ్ళకి చదువా, సంధ్యా ? వాళ్ళకు మన మాటలెందుకు నచ్చుతయ్ ? ఈ సీతాపతి వంటివాళ్ళే వాళ్ళకు నచ్చుతారు.

లేదు - నాకీ సీతాపతి ఎవరో తెలీదు. తెలియవలసిన అవసరం కూడా నాకు లేదు. వాడు నన్నెరుగుదునని చెప్పుకుంటే నేనందుకు బాధ్యుణ్ని కాను. అట్లా గొప్పగా ఉంటుందని చెప్పుకుంటే చెప్పుకోనివ్వండి. నన్నెరుగుదు నని చెప్పుకునే వాళ్లెంతమందిలేరు గనక ?

★


మారుతీ విలాస్
కాఫీ & భోజన హోటల్

బిసెంట్ రోడ్, గవర్నరుపేట, బెజవాడ

వెన్న కాచిన నేతితో తయారు చేసిన పదార్థాలు వంటలోను, వడ్డనలోను శుచి, ఆరోగ్యం ఒక్కసారి మా ఆతిథ్యం స్వీకరించండి !

★

మీ కిదే మా సుస్వాగతం !

ఇట్లు
కొత్తూరు సుబ్బారావు
మేనేజరు
మారుతీ విలాస్.